క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖ గ్రంథాలయాలలో గత నెల 28 నుండి వేసవి విజ్ఞాన శిబిరములు కొనసాగుతున్నాయి. సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో 10వ రోజైన బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కలర్స్ వేయటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ కవి, రచయిత అచ్చుల సుబ్బారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరములు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి కె.వెంకటరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

74 మందికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్



రొంపిచర్ల: అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల విప్పర్ల పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ మూడవరోజు కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు నిర్వహించిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ శిబిరంలో మొత్తం 74 మంది పెద్దలకు, పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేశామని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి వై. మహేష్ కుమార్ తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం. వెంకటరమణ ఆదేశాల మేరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ సంతగుడిపాడు బ్రాంచ్ మేనేజర్ ఎం. కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ బి. వెంకటేశ్వర్లు, డీఏ శ్రీకాంత్, సొసైటీ అధికారులు ఎస్. లక్ష్మీరెడ్డి, ఎస్. వీరారెడ్డి, సిబ్బంది వై. లక్ష్మారెడ్డి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తిస్తే నివారణ సాధ్యం

యడ్లపాడు: ప్రాథమిక దశలో చికిత్సతో క్యాన్సర్ పూర్తిగా నయం చేయవచ్చని పల్నాడు జిల్లా వైద్యారోగ్య అధికారి బి.రవి స్పష్టం చేశారు. బుధవారం యడ్లపాడు ప్రాథమిక వైద్యశాలను ఆయన సందర్శించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో హనుమకుమార్, పద్మావతితో కలిసి ఆస్పత్రిలో నిర్మించి ల్యాబ్ పనుల్ని పరిశీలించారు. వైద్యాధికారులు ప్రభాకరరావు, భరద్వాజాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైద్యశాఖ ద్వారా అందించే పలు పథకాలు, సేవలను వివరించారు. 24 గంటలు ఆస్పత్రి తెరిచి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దాడి ఘటనపై కేసు

నాదెండ్ల: లారీలో ఇసుకను తెప్పించుకుని దిగుమతి అనంతరం నగదు అడిగినందుకు తనపై దాడిచేశారంటూ యనమదల గ్రామానికి చెందిన వెన్నెల శౌరిరాజు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు యనమదల గ్రామానికి చెందిన వెన్నెల శౌరిరాజు ఇసుక సప్లయి చేస్తుంటాడు. ఈ నెల 5న గణపవరం గ్రామానికి చెందిన రాజారావు ఇసుక కావాలని కోరటంతో చిలకలూరిపేటకు చెందిన డ్రైవర్ శ్రీనుతో ఇసుక లారీ పంపాడు. ఇసుక అన్‌లోడ్ అనంతరం నగదు తీసుకునేందుకు ఏఎంజీ పక్కనున్న వేబ్రిడ్జి వద్దకు రావాలని రాజారావు చెప్పటంతో శౌరిరాజు అక్కడకు వచ్చాడు. నగదు విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరగటంతో రాజారావు, అతని సోదరుడు అనిల్, మరో పదిహేను మందితో కలిసి దాడికి పాల్పడినట్లు శౌరిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు చప్పట్లు కొట్టారు... నేడు పొట్ట కొడుతున్నారు

- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరును నిరసించిన పారిశుద్ధ్య కార్మికులు
- కంచాలు మోగిస్తూ జాతిపిత విగ్రహం చుట్టూ ప్రదక్షిణ చేసి నిరసన



కంచాలు మోగిస్తూ నిరసన తెలియచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు

నరసరావుపేట: కరోనా సమయంలో విశేష సేవలు అందించారంటూ నాటి ముఖ్యమంత్రి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పొగడ్తలతో ముంచెత్తి చప్పట్లు కొట్టి ప్రోత్సహించారని, ఇప్పుడు అధికారంలో ఉన్న వారు తమ పొట్ట కొడుతున్నారని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 49వ రోజుకు చేరింది. బుధవారం కంచాలు మోగిస్తూ అమ్మా జీతం, అయ్యా ఉద్యోగం అంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం జాతిపిత విగ్రహం చుట్టూ కంచాలు మోగిస్తూ కార్మికులు తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు నెల మొత్తం పని చేసినా సగం రోజులకే వేతనాలు ఇస్తున్నారని, మిగిలిన వేతనం ఎవరు కాజేస్తున్నారో తెలియకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఆప్కాస్ లో ఉన్న మిగిలిన కార్మికులతో పాటు తమకు రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వ హయాంలో తాము చేపట్టిన నిరసనలకు మద్దతు తెలిపిన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తమ గోడు వినిపించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉంటే ఒకలా, అధికారంలో ఉంటే మరోలా ప్రజాప్రతినిధుల వ్యవహరిస్తున్న తీరు హేయమన్నారు. వీరికి కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి రెడ్‌బాషా, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, బాదుగున్నల శ్రీను సంఘీభావం తెలిపారు.

విద్యార్థులను పోటీపరీక్షలకు సన్నద్ధం చేయాలి

భారతరాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు



నాదెండ్ల: ఇంటర్మీడియట్ కోర్సులున్న కళాశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు యాజమాన్యంలో పేని చేస్తున్న విద్యాసంస్థల్లో పోటీ పరీక్షల బోధనా నిపుణులను ప్రభుత్వం నియమించాలని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు డిమాండ్ చేశారు. నాదెండ్లలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని బట్టి వారు భవిష్యత్‌లో కోరుకునే రంగంలో ఉన్నతస్థాయి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశాలు కల్పించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం గంటపాటూ ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అకడమిక్ సిలబస్‌తో పాటూ గ్రూప్-1,2 పోటీ పరీక్షలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని విద్యార్థులకు కల్పించాలన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్చాలనుకునే తల్లిదండ్రులు అకడమిక్ సిలబస్‌తో పాటూ పోటీ పరీక్షల సిలబస్ ఎంపిక చేసుకోవటం ఉత్తమమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నాణ్యమైన వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోకేశా.. పాదయాత్ర హామీలు ఏమయ్యాయి?

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ



మాట్లాడుతున్న బందెల నాసర్‌జీ

చిలకలూరిపేట: యువగళం పాదయాత్రలో నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమయ్యారని అఖిలభారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ విమర్శించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటం లేదని విమర్శలు చేసిన లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్ని హామీలు నెరవేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను గాలికి వదిలివేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి విద్యార్థి, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, నాయుడు సాయిశ్రీనాథ్, గుడిపల్లి జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జన్మదిన వేడుకలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణ నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈసందర్భంగా 102 మంది మహిళలచే అఖండ కుంకుమార్చన, 102 కలశాల ఊరేగింపు, వాసవీ స్తూపానికి అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్యవైశ్య ప్రముఖులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమాసు మెహర్‌బాబు, కార్యదర్శి కె.వెంకటప్పయ్య, కోశాధికారి పొత్తూరి వెంకట లక్ష్మీవరప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

శిక్షణ కేంద్రాలు 'కూటమి' సంపాదన కేంద్రాలు

నరసరావుపేట: బీసీ కులాలకు శిక్షణ ఇచ్చే కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాలలో కూడా కూటమి నాయకులు, అధికారులు అవినీతికి పాల్పడటం శోచనీయమైన విషయమని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణ బీసీ సెల్ కన్వీనర్ అచ్చి శివకోటి, ఇంటలెక్చువల్ రాష్ట్ర కమిటీ సెక్రటరీ ఈయం. స్వామి, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు మర్రిపూడి రాంబాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వారిని ఆర్థికంగా బలోపేతం చేసే మాట అటుంచి కూటమి నాయకులకు కోట్ల రూపాయల డబ్బు దోచిపెట్టి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాల ముసుగులో ఈ ప్రభుత్వం చేస్తున్న దోపిడీని రాష్ట్ర వ్యాప్తంగా బీసీ వర్గీయులందరూ వ్యతిరేకించాలని, ఈ కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు.

స్థలమిచ్చిన తర్వాతే ఖాళీ చేయండి

ఎస్‌సీ కాలనీ వాసులకు ఎమ్మెల్యే సూచన



నరసరావుపేట: ప్రభుత్వం ద్వారా నివేశన స్థలం కేటాయించిన తర్వాతనే మీరు ఎస్‌సీ గృహాలను ఖాళీ చేయాల్సి ఉంటుందని, అప్పటి వరకు మీ జోలికి ఎవరూ రారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఎస్‌సీ క్వార్టర్ల నుంచి ఖాళీ చేయాలంటూ తమపై పోలీసుల చేసిన దౌర్జన్యాన్ని నిరసిస్తూ బుధవారం కాలనీ వాసులు కలెక్టరేట్ నుంచి ర్యాలీగా బయలుదేరి గుంటూరు రోడ్డులోని టీడీపీ పార్టీ కార్యాలయానికి చేరుకొని రోడ్డుపై బైఠాయించారు. వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులు నివేశన స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కేవీఎస్ కృష్ణ, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌వలి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు నల్లపాటి రామారావు, సీఐటీయూ నాయకుడు షేక్ శిలార్ మసూద్, మాల మహానాడు జిల్లా కార్యదర్శి బోరుగడ్డ అంబేడ్కర్ పాల్గొన్నారు.

బెయిల్ పై విడుదలై దాడి చేశాడు!

శావల్యాపురం: బెయిల్‌పై విడుదలైన గంటల వ్యవధిలోనే బాధితుడిపై ఓ నిందితుడు దాడి చేసిన ఘటన మండలంలోని వేల్పూరులో బుధవారం జరిగింది. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు విలేకర్ల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి నెలలో గ్రామానికి చెందిన మెడబోయిన వెంకటేశ్వర్లు, సాదినేని వీరాంజనేయులుకు చెందిన పంట పొలాలు దగ్ధం అయ్యాయి. ఈ కేసులో బొల్లా విజయ్ కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. మంగళవారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదలైన విజయ్ కుమార్ తన అరెస్టుకు కారణమయ్యాడని ఆరోపిస్తూ మెడబోయిన వెంకటేశ్వర్లును దుర్భాషలాడుతూ విచక్షణారహితంగా దాడికి పాల్పడి చంపబోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు విజయకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచామని ఎస్సై తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే సహించేది లేదని ఆయన తెలిపారు.

కారును ఢీకొట్టిన ఆటో

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గం రోడ్డు వెంబడి ఆగి ఉన్న కారును అతి వేగంతో ఆటో ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవరుకు కాలు విరిగిపోయిన ఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు కారులో శుభకార్యం నిమిత్తం కార్డులు పంపిణీ చేయటానికి గుంటూరు నుంచి పొదిలికు బయలుదేరారు. మార్గమధ్యంలో శావల్యాపురంలో రహదారి వెంబడి వాటర్ బాటిల్ కోనుక్కోవడానికి కారును రోడ్డు వెంబడి ఆపాడు. ఈక్రమంలో నరసరావుపేట నుంచి వినుకొండ వైపు అతివేగంతో వస్తున్న ఆటో ఆదుపుతప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. ఈఘటనలో కారు వెనుకభాగం పాక్షికంగా దెబ్బతినగా ఆటో ముందుభాగం ధ్వంసం అయింది. ఆటో డ్రైవరుని వినుకొండ వైద్యశాలకు తరలించారు.

అనధికార లేఅవుట్‌కు కౌన్సిల్ ఆమోదమా ?

- మున్సిపల్ అధికారుల వైఖరిపై విమర్శలు
- కాపు అసోసియేషన్ అధ్యక్షుడు శివనాగేశ్వరరావు



చిలకలూరిపేట: అనధికార లేఅవుట్‌కు కౌన్సిల్ తీర్మానం ద్వారా ఆమోదించుకోవడం అక్రమమని కాపు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు విమర్శించారు. సంఘ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్ 30వ తేదీన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తొమ్మిదో అంశంగా పసుమర్రు రోడ్డులోని అనధికార లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి ప్లాన్లు మంజూరు చేసే విషయమై కౌన్సిల్ ఆమోదానికి ఉంచటం ఏ మాత్రం సరికాదన్నారు. స్వయంగా కౌన్సిల్ తీర్మానంలోనే ప్లాట్లు కొన్న యజమానులకు అవి అనధికార లేఅవుట్లని, తెలియక కొన్నారని పేర్కొన్నారని తెలిపారు. అనధికార లేఅవుట్లలో ప్లాన్లు మంజూరు చేయవద్దని జీవో నంబర్ 20 రూపొందించి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ ఎన్నో బహిరంగ సభల్లో , సమావేశాల్లో చెప్పటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు ఎన్ని లక్షలు తీసుకొని ఈ అంశాన్ని ఎజెండాలో పొందుపరిచారోనని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిబంధనలను అతిక్రమించి రాజకీయ వత్తిళ్లు, ఇతర ప్రలోభాలకు లోనై వ్యవహరిస్తున్న తీరుపై డైరెక్టర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు, మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, సీఎం చంద్రబాబు నాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సీహెచ్‌వోల ర్యాలీ

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత
- 10వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

నరసరావుపేట: ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో సీహెచ్‌ఓలు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గత పది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ స్పందించని కూటమి ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి గాంధీ పార్కు ఎదుట పదవరోజు ధర్నాలో పాల్గొన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని, తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వేతన బకాయిలు చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీ పలనాడు రోడ్డు మీదగా చెక్‌పోస్ట్ సెంటర్, రామిరెడ్డిపేట, వాసవీ డిగ్రీ కాలేజీ పెద్ద పోస్ట్ ఆఫీస్ మీదుగా గాంధీ పార్కుకు చేరింది. వారికి ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి రంగయ్య, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్ మసూద్, గాంధీ స్మారక సమితి అధ్యక్షులు ఈదర గోపీచంద్ మద్దతు తెలియచేసి ప్రభుత్వ మొండి వైఖరిని నిరసించారు. పల్నాడు జిల్లా సీహెచ్‌ఓల సంఘ నాయకులు అనుపమ, సాగర్, రాము, మస్తాన్‌వలి, వినోద్ ర్యాలీకి నేతృత్వం వహించారు.

స్పోర్ట్స్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసగుప్తా



గుప్తాకు నియామకపత్రం అందజేస్తున్న చక్రపాణిరెడ్డి

నరసరావుపేట: ఏపీ ఫ్రీడమ్ ఫైటర్ కన్నెగంటి హనుమంతు మెమోరియల్ స్పోర్ట్స్ సొసైటీ పల్నాడు జిల్లా అధ్యక్షులుగా రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు కేవీఎస్‌వీ శ్రీనివాసగుప్తా నియమితులయ్యారు. బుధవారం స్టేట్ చైర్మన్, రిటైర్డు ఎస్పీ డాక్టర్ చెన్నంశెట్టి చక్రపాణిరెడ్డి చేతుల మీదుగా నరసరావుపేటలోని తన స్వగృహంలో నియామకపత్రాన్ని స్వీకరించారు. స్టేట్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జిల్లాలో విద్యార్థిని విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక ధారుడ్యం కలగచేసేందుకు క్రీడలు నిర్వహిస్తూ ఉంటామని, పల్నాడు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు శ్రీనివాసగుప్తాను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. యువతి యువకులకు క్రీడలు నిర్వహించి భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి తోడ్పడాలని కోరారు. శ్రీనివాసగుప్తా మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియచేశారు. సొసైటీ అభివృద్ధి పథంలో నడపడానికి శాయశక్తుల కృషిచేస్తానని అన్నారు. వ్యవస్థాపకులు టి.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ సీహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.నాగేశ్వరరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రెజరర్ జవహర్, వాగ్దేవి విద్యా సంస్థల అధినేత రాయల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎ. సలోమి

నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమ పథకాలపై బుధవారం మల్లమ్మ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ. సలోమి పాల్గొని మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు చట్ట ప్రకారం ఉన్న సౌలభ్యాలు, హక్కులు, ఉచితంగా న్యాయ సహాయం పొందే విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కార్మిక శాఖ సహాయ కమిషనర్, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, కార్మిక సంఘ ప్రతినిధులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అవగాహన సదస్సు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో సొసైటీ వారి సారథ్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా గోదాము నిర్వాహణ,శీతల గిడ్డంగి కేంద్రాలపై రైతులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా సొసైటీ చైర్‌పర్సన్ నర్రా సురేంద్రబాబు పాల్గొని మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు గిట్టుబాటు ధర లేని సమయంలో గోదాములు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు, రైతులు పాల్గొన్నారు.

విప్లవ స్ఫూర్తి రగిల్చిన అల్లూరి సీతారామరాజు

చిలకలూరిపేట: గిరిజనుల్లో విప్లవస్ఫూర్తి రగిలించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని గిరిజన సంఘాల నాయకులు కొనియాడారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక కార్యాలయంలో బుధవారం అల్లూరి సీతారామరాజు, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.శ్రీనునాయక్, ఎస్.నాగరాజు, పి.వెంకటబుల్లోడు, కె. శ్రీనివాసరావు, శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

వినుకొండ : పట్టణంలోని గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సమ్మర్ క్యాంప్‌నకు వచ్చిన విద్యార్థులతో శిక్షణ ఎలా జరుగుతుందని, ఏం నేర్చుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఈ వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో బుధవారం నిర్వహించిన దివిస్ కంపెనీ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 11మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి తెలిపారు. కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 32మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 11మంది ఎంపికైనట్టు వివరించారు. ఈసందర్భంగా కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త మాట్లాడుతూ, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీ ఆఫర్ లెటర్స్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త అందచేసారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

వినుకొండ: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన మహోత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కారంపూడి రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కాంప్లెక్స్ వద్ద వినుకొండ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సొలసలో...

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో బ్రహ్మంగారి 332వ ఆరాధన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూల విరాట్‌లకు పంచామృతాభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బోయపాలెం గ్రామంలో శ్రీగోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి గారి ఆరాధన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. .

శావల్యాపురంలో...

శావల్యాపురం:మండలంలోని మతుకుమల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన వేడుకలు బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి పులుకూరి శ్రీనివాసరావు సారథ్యంలో స్వామివారి మూల విరాట్ విగ్రహాలను పూలమాలలు నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

నూజెండ్ల: మండలంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వి.అప్పాపురం, నూజెండ్ల,ఐనవోలు తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో స్వామి వారికి వేకువ జాము నుంచే పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.



చిలకలూరిపేటలో పులిహోర ప్రసాదం పంపిణీ చేస్తున్న కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: కాలజ్ఞానం ప్రబోధించిన గొప్ప ఆధ్యాత్మికవేత్త వీరబ్రహ్మేంద్రస్వామి అని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు చెప్పారు. శ్రీదత్తసాయి అన్నదాన సమాజం అధ్యక్షుడు పూసపాటి బాలాజి ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌వద్ద భక్తులకు పులిహోర ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు.

గణపవరంలో...

నాదెండ్ల: గణపవరం కోదండరామాలయంలో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు దర్శి ఉమామహేశ్వరశర్మ, అనిల్‌కుమార్‌లు అమ్మవార్లను అలంకరించి కుంకుమపూజ, ఆకుపూజలు నిర్వహించారు. గోత్రనామ పూజలు నిర్వహించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు



రొంపిచర్ల: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం వాసవీ అమ్మవారి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కుంకుమ పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వాకాని కోదండ రామా దీక్షితులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు మద్ది రామచంద్రరావు, మద్ది రామ బ్రహ్మానందరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వినుకొండలో...

వినుకొండ: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద వేంచేసి ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకులు పొట్టినారాయణ ఆధ్వర్యంలో పంచామృతాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా ఆలయ వార్షిక మహోత్సవం

యడ్లపాడు: స్థానిక పురాతన ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం భక్తులు కిటకిటలాడారు. ఆలయం 8వ వార్షిక మహోత్సవం సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వేకువజామునే ఆలయ పూజారులు జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిట్స్ స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు

రొంపిచర్ల: రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పాఠ్య పుస్తకాలు బుధవారం రొంపిచర్లలోని కిట్స్ స్టాక్ పాయింట్‌కు చేరాయి. ఈ పుస్తకాలను మండల విద్యాశాఖ అధికారి డి. బ్రహ్మేశ్వరరావు ఆధ్వర్యంలో స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు. సర్వేపల్లి రాధాకృష్ణ, విద్యార్థిమిత్ర, కిట్స్‌లో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యశిస్తున్న విద్యార్థులకు 17,911 పాఠ్యపుస్తకాలు అవసరం ఉంది. అయితే తొలి విడతగా 12,153 పుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరాయని ఎంఈవో తెలిపారు.